





Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక








శుక్రవారం 18-09-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :92 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్


## ట్యాంక్‌బండ్‌పై హైకోర్టు ఆంక్షలు!




2 లో

- ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలకు అనుమతి లేదు
- హైకోర్టు ఆదేశాలతో అధికారులు కీలక నిర్ణయం
- హుస్సేన్‌సాగర్ పరిరక్షణకు కఠిన చర్యలు
- ట్యాంక్‌బండ్ పరిసరాల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు
- నగరవ్యాప్తంగా ప్రత్యామ్నాయ నిమజ్జన ఏర్పాట్లు
- బేబీ పాండ్స్.. కృత్రిమ కొలనులు సిద్ధం
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

## విమోచన వీరులను మరువొద్దు!

- విమోచన దినోత్సవ వేడుకల్లో ఉపరాష్ట్రపతి
- ప్రజా ఉద్యమంగా విమోచన పోరాటం
- రాంజీ గోండ్, తుర్రేబాజ్ ఖాన్ త్యాగాలు
- పటేల్ పాత్రను గుర్తుచేసిన రాధాకృష్ణన్
- కేంద్ర బలగాల సేవలకు ప్రశంసలు
- సమాన హక్కులతోనే జాతీయ ఐక్యత



2 లో

**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (ఇది కద నిజం):** హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా ఇక్కడ ఉండటం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని ఉపరాష్ట్రపతి సి.పీ. రాధాకృష్ణన్ అన్నారు. హైదరాబాద్ సంస్థానం విమోచన, భారతదేశంలో విలీనం కోసం ప్రాణత్యాగం చేసిన వారిని గౌరవించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు.

హైదరాబాద్ విమోచన పోరాటంలోని మరుగునపడిన వీరుల కథలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ఈ పోరాటం కేవలం ప్రభుత్వాలు లేదా ప్రముఖ నాయకులకు సంబంధించినది కాదని.. ఇది ప్రజా ఉద్యమమని అన్నారు. విద్యార్థులు, మేధావులు, రచయితలు, సామాజిక కార్యకర్తలు, రాజకీయ కార్యకర్తలు, రైతులు, సామాన్య ప్రజలు ఇందులో పాల్గొన్నారని గుర్తుచేశారు. అనేక మంది జైలు శిక్షలు, హింస, వ్యక్తిగత ఇబ్బందులను ఎదుర్కొన్నారని తెలిపారు.

## క్షుద్ర పూజల వివాదం.. కోర్టుకెక్కిన హరీశ్!

- క్షుద్ర పూజల ఆరోపణలపై కేసు
- మహేష్ గౌడ్, దయాకర్‌లకు నోటీసులు
- స్పందన లేకపోవడంతో కోర్టును ఆశ్రయం
- నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో పిటిషన్
- కాంగ్రెస్ నేతలపై క్రిమినల్ పరువునష్టం దావా
- రాజకీయ ప్రతిష్ట దెబ్బతీసేలా ఆరోపణలు
- ఆరోపణలను ఖండించిన హరీశ్ రావు

2 లో

## ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈసీ కసరత్తు!

- రెండు స్థానాలకు ఓటర్ల జాబితా
- నవంబర్ 1 అర్హత తేదీ
- పాత ఓటర్లూ కొత్తగా దరఖాస్తు
- ఫారమ్-18తో దరఖాస్తు తప్పనిసరి
- విద్యార్హత సర్టిఫికెట్లు జతచేయాలి
- నవంబర్ 25న డ్రాఫ్ట్ జాబితా
- డిసెంబర్ 30న తుది జాబితా




**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (ఇది కద నిజం):** తెలంగాణలో త్వరలో ఖాళీ కాబోతున్న వరంగల్-ఖమ్మం-నల్గొండ, మహబూబ్ నగర్- రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల భర్తీ కోసం ఈసీ కసరత్తు మొదలు పెట్టింది. ఈ రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు నూతన ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి గురువారం విడుదల చేశారు. ఈ నియోజకవర్గాల స్థానాల గడువు మార్చి 2027తో ముగియనుండటంతో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొత్తగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయనున్నారు.

2 లో

## విలీన పోరాటంపై కవిత కీలక వ్యాఖ్యలు!

- సెప్టెంబర్ 17 చరిత్రపై రాజకీయ రగడ
- కాంగ్రెస్, బీజేపీలపై కవిత తీవ్ర విమర్శలు
- విలీన పోరాటాన్ని వక్రీకరిస్తున్నారన్న ఆరోపణ
- ఆనాటి పోరాటంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఎక్కడ?
- మతాలకు అతీతంగా ప్రజల పోరాటం
- పోరాట యోధుల త్యాగాలను కవిత స్మరణ
- ప్రజల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందన్న కవిత

2 లో

## అక్టోబర్ 1 నుంచి కొత్త చట్టం!

- నమ్మ క్లినిక్‌లో అవకతవకలపై ఆరోపణలు
- విధులకు రాకుండానే రెండేళ్లుగా జీతం
- ఆర్టీఐ రికార్డులతో వెలుగులోకి వ్యవహారం
- ఎమ్మెల్యే మేనకోడలిపై తీవ్ర ఆరోపణలు
- ప్రజాధనం దుర్వినియోగంపై ప్రతిపక్షాల ఫైర్
- సమగ్ర విచారణకు ప్రతిపక్షాల డిమాండ్

2 లో


## ఎస్‌బీఎన్‌పై కేంద్రం కఠిన చర్య!



2 లో

**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (ఇది కద నిజం):** పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న 'షాజాద్ భట్టి నెట్‌వర్క్ (ఎస్‌బీఎన్)'ను చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది.

## బ్రిక్స్ వేళ పాక్, ఐఎస్ఐ ఉగ్ర కుట్ర బట్టబయలు




2 లో

- బ్రిక్స్ సదస్సుపై ఉగ్ర కుట్రకు పాక్ ప్లాన్
- సరిహద్దు నుంచి ఉగ్రవాదుల చొరబాటుకు యత్నం
- హీరానగర్ సెక్టార్‌ను ఎంచుకున్న ఉగ్ర మూకలు
- బోబియా ప్రాంతంలో చొరబాటు స్థావరాల గుర్తింపు
- భద్రతా బలగాల అప్రమత్తతతో కుట్ర భగ్నం
- ప్రభుత్వ భవనాలు, సైనిక శిబిరాలే లక్ష్యమా?
- పెను ఉగ్రదాడి తప్పడంతో ఊపిరిపీల్చుకున్న భారత్

# కేసీఆర్ భూములపై రగడ!



- అఫిడవిట్‌లపై పొంగులేటి ప్రశ్నలు
- 2004లో భూమి లేదన్న కేసీఆర్
- తర్వాత వేల కోట్ల ఆస్తులెలా?
- కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి ఫైర్
- ఆస్తుల పెరుగుదలపై నిలదీత
- ప్రభుత్వ భూములపై ఆరోపణలు
- అసైన్డ్ భూముల అక్రమాలంటూ విమర్శలు
- 22ఏ భూములపై రగిలిన వివాదం
- కేసీఆర్ కుటుంబ ఆస్తులపై కాక

**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (ఇది కద నిజం):** తెలంగాణ రాజకీయాల్లో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆస్తులపై మరోసారి తీవ్ర రాజకీయ విమర్శలు తెరపైకి వచ్చాయి. అసెంబ్లీ వేదికగా.. కేసీఆర్ ఫాంహౌస్, ఆయన కుటుంబానికి ఉన్న భూములకు సంబంధించిన వివరాలను వెల్లడించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ప్రభుత్వ భూములు ఉంటే నిగ్గు తేల్చాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే అటు బీఆర్ఎస్.. ఇటు కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రభుత్వ భూముల విషయంలో తీవ్ర మాటల యుద్ధం నెలకొంది. సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను ఖండిస్తూ.. బీఆర్ఎస్ నేతలు హరీశ్ రావు, కేటీఆర్, జగదీష్ రెడ్డిలు.. తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలోనే తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తాజాగా చేసిన ట్వీట్ తెగ వైరల్ అవుతోంది.

## సెమీకాన్ ఇండియా షురూ

- సెమీకాన్ ఇండియా-2026కు మోదీ శ్రీకారం
- ప్రపంచ చిప్ హబ్‌గా భారత్ లక్ష్యం
- నాలుగేళ్లలో కీలక పురోగతి
- ప్రపంచ మార్కెట్లకు భారత చిప్‌లు
- జీడీపీ వృద్ధి 7.8 శాతం
- యువత నైపుణ్యాలపై ప్రధాని ఫోకస్
- మౌలిక సదుపాయాలతో తయారీకి ఊతం



2 లో

**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (ఇది కద నిజం):** భారత్‌ను ప్రపంచ సెమీకండక్టర్ తయారీ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. దేశంలో సెమీకండక్టర్ రంగం రెండో దశకు చేరుకుందని, ఇతర దేశాలు ఈ రంగంలో పురోగతి సాధించేందుకు పదేళ్ల సమయం తీసుకుంటే భారత్ కేవలం నాలుగేళ్లలోనే కీలక ముందడుగు వేసిందని తెలిపారు. భారత్‌లో తయారవుతున్న చిప్‌లు త్వరలో ప్రపంచ మార్కెట్లకు మరింత చేరువవుతున్నాయని చెప్పారు. ఢిల్లీలోని యశోభూమి కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం 'సెమీకాన్ ఇండియా-2026' సదస్సును ప్రధాని మోడీ ప్రారంభించారు. సెప్టెంబర్ 17 నుంచి 19 వరకు మూడు రోజుల పాటు ఈ మెగా చిప్ సమ్మిట్ జరగనుంది.

## 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ!

- ప్రజా పాలన దినోత్సవ వేడుకలు
- అమరవీరులకు సీఎం నివాళులు
- నాలుగు కోట్ల ప్రజలే ప్రాతిపదిక
- సంక్షేమ పథకాలపై ప్రభుత్వ ఫోకస్
- సామాజిక న్యాయానికి పెద్దపీట
- యువతకు ఉద్యోగాల కల్పనపై దృష్టి




2 లో

**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (ఇది కద నిజం):** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. హైదరాబాద్ నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళు లర్పించారు. అనంతరం పోలీసు బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించి రాష్ట్ర ప్రజలకు ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సెప్టెంబర్ 17ను ప్రజా పాలన దినోత్సవంగా అధికారికంగా నిర్వహిస్తున్నామని ప్రభుత్వం గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఇక జెండా ఆవిష్కరణ తర్వాత.. రాష్ట్ర ప్రజలు, ప్రభుత్వ పాలనను ఉద్దేశించి సీఎం మాట్లాడారు.

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

శుక్రవారం 18-09-2026

# క్షుద్ర పూజల వివాదం.. కోర్టుకెక్కిన హరీశ్!



**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (ఇది కద నిజం):** చేతబడులు, క్షుద్ర పూజల పేరుతో తనపై తీవ్రమైన, నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు న్యాయపోరాటానికి దిగినట్లు తెలుస్తోంది. ఇప్పటికే వారికి లీగల్ నోటీసులు జారీ చేసిన హరీశ్ రావు, వారు బహిరంగ క్షమాపణ చెప్పకపోవడంతో ప్రజాప్రతినిధుల కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. గురువారం హైదరాబాద్‌లోని ప్రజాప్రతినిధుల నాంపల్లి కోర్టులో కాంగ్రెస్ నేతలపై క్రిమినల్ పరువు నష్టం పిటిషన్ దాఖలు చేసినట్లు తెలుస్తోంది. తన రాజకీయ ప్రతిష్టను, వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకు కాంగ్రెస్ నేతలు అసత్య ఆరోపణలు చేశారని ఇప్పటికే హరీష్ రావు పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేసు నేపథ్యం..

తెలంగాణలో వర్షాలు పడకుండా అడ్డుకునేందుకు హరీశ్ రావు వేర్వేరు ప్రాంతాలు, ఆలయ సందర్శనలు చేసి క్షుద్ర పూజలు నిర్వహించారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన హరీశ్ రావు.. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎప్పుడూ లేని విధంగా తన భక్తిభావాన్ని కూడా రాజకీయం చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ గతంలో లీగల్ నోటీసులు పంపినప్పటికీ స్పందన రాకపోవడంతో, తాజాగా కోర్టు మెట్లెక్కినట్లు తెలుస్తోంది.

# సెమీకాన్ ఇండియా షురూ.. మోడీ పిలుపు!

మొదటి పేజీ తరువాయి

'సిలికాన్ టు సిస్టమ్స్: బిల్డింగ్ ది ఈకోసిస్టమ్' అనే థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు 300 అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

భారత్ వృద్ధి బాటలో..

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థ మందగమనాన్ని ఎదుర్కొంటున్న సమయంలోనూ భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని అన్నారు. 2026 జూలై తొలి త్రైమాసికంలో దేశ జీడీపీ వృద్ధి రేటు 7.8 శాతంగా నమోదైందని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రపంచానికి నమ్మకం పెరుగుతోందనడానికి ఇటీవల నిర్వహించిన బ్రిక్స్ సదస్సు కూడా ఉదాహరణ అని పేర్కొన్నారు. పది రోజుల క్రితం ముంబైలో జరిగిన ఫిన్‌టెక్ సదస్సులో ఏఐ, టోకనైజేషన్, క్వాంటమ్ టెక్నాలజీలపై విస్తృతంగా చర్చ జరిగిందని మోడీ తెలిపారు. కొత్త సాంకేతికతలను అందిపుచ్చుకుంటూ భారత్ వేగంగా ముందుకు సాగుతోందన్నారు.

యువతకు ప్రధాని పిలుపు

సెమీకండక్టర్ రంగంలో చిప్ డిజైన్‌కు అవసరమైన నైపుణ్యాలను భారత యువత అభివృద్ధి చేసుకుంటోందని ప్రధాని చెప్పారు. దేశ యువత భారత్ వృద్ధికి మరింతగా సహకరించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు స్వయంగా తయారు చేసిన మైక్రోచిప్‌లను తనకు బహుమతిగా అందించారని మోడీ తెలిపారు. దేశంలో వేగంగా విస్తరిస్తున్న మౌలిక సదుపాయాలు, మెరుగైన కనెక్టివిటీతో లాజిస్టిక్స్, తయారీ రంగాలు మరింత బలోపేతమవుతున్నాయని ప్రధాని అన్నారు. ఈ సెప్టెంబర్‌లోనే దేశంలో దాదాపు 3,000 కిలోమీటర్ల మేర డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. వీటి ద్వారా సరుకు రవాణా వేగవంతమై తయారీ రంగానికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు.

విశ్వకర్మ జయంతి సందర్భంగా..

ఈ రోజు విశ్వకర్మ జయంతి కూడా అని విశ్వకర్మ జయంతి రోజే 'పీఎం విశ్వకర్మ' పథకం ప్రారంభం కావడం శుభపరిణామమని మోడీ అన్నారు. భారత ప్రాచీన నిర్మాణ సంప్రదాయాలను 21వ శతాబ్దపు ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేస్తూ ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

# అక్టోబర్ 1 నుంచి కొత్త చట్టం!




**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (ఇది కద నిజం):** దేశవ్యాప్తంగా జనన, మరణాల ఆలస్య నమోదుపై నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'జనన, మరణాల నమోదు (సవరణ) చట్టం-2026' అక్టోబర్ 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమల్లోకి రానుంది. ఈ మేరకు భారత రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. పార్లమెంటు ఉభయ సభలు ఆమోదం తెలిపిన అనంతరం, రాష్ట్రపతి ఆమోద ముద్ర పడటంతో ఈ సవరణ బిల్లు చట్ట రూపం దాల్చింది. ఈ నూతన చట్టం ప్రకారం పుట్టుకలు, మరణాల వివరాల నమోదులో ఎలాంటి జాప్యం, అవకతవకలు జరగకుండా నిరోధించేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలను నిర్దేశించింది.

సెక్షన్ 1 లోని ఉప-సెక్షన్ (2) ద్వారా సంక్రమించిన అధికారాల మేరకు కేంద్ర ప్రభుత్వం 2026 అక్టోబర్ 1ని ఈ చట్ట నిబంధనలు అమలులోకి వచ్చే తేదీగా ఖరారు చేసినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ నూతన సవరణ చట్టం ద్వారా డిజిటల్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు పాఠశాల ప్రవేశాలు, పాస్‌పోర్ట్, ఆధార్, ఓటర్ కార్డు, వివాహ రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు జనన ధ్రువీకరణ పత్రం అత్యంత కీలకమైన ప్రాథమిక పత్రంగా మారనుంది. ఆలస్యంగా చేసుకునే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను క్రమబద్ధీకరించడం, నకిలీ సర్టిఫికెట్లను అరికట్టడం, పారదర్శకమైన కేంద్రీకృత డాటాబేస్‌ను నిర్వహించడమే లక్ష్యంగా ఈ చట్ట నిబంధనలను అమలు చేయనున్నారు.

# ట్యాంక్‌బండ్‌పై హైకోర్టు ఆంక్షలు!




**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (ఇది కద నిజం):** హైదరాబాద్ నగర పరిధిలో వినాయక నిమజ్జనోత్సవాలకు సంబంధించి అధికారులు కీలక ప్రకటన చేశారు. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన కఠిన ఆదేశాల నేపథ్యంలో హుస్సేన్‌సాగర్ ట్యాంక్‌బండ్‌పై విగ్రహాల నిమజ్జనానికి ఎలాంటి అనుమతి లేదని హైదరాబాద్ సిటీ పోలీస్, జీహెచ్ఎంసీ అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు నగరంలోని పలు ప్రాంతాల్లో, ట్యాంక్‌బండ్ పరిసరాల్లో హెచ్చరిక బోర్డులు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

హైకోర్టు ఆదేశాల మేరకు..

హుస్సేన్‌సాగర్‌ను కాలుష్యం బారి నుంచి రక్షించడానికి, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని హైకోర్టు గతంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి విగ్రహాల నిమజ్జనానికి తావులేదని అధికారులు తేల్చిచెప్పారు. ఉత్సవ కమిటీలు, పూజా సంఘాలు ఈ నిబంధనలను కచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు..

ఈ ఏడాది ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలను నిషేధించినప్పటికీ, ప్రజలకు ఇబ్బంది కలగకుండా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నగరవ్యాప్తంగా పలుచోట్ల ప్రత్యేక బేబీ పాండ్స్, క్రేన్లు, కృత్రిమ నిమజ్జన కొలనులను ఏర్పాటు చేశారు. ఒకవేళ నిబంధనలను ఉల్లంఘించి ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనానికి ప్రయత్నించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ సిటీ పోలీసులు హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ప్రభుత్వ సూచనల మేరకు పండగను జరుపుకోవాలని కోరారు.

# 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ!

మొదటి పేజీ తరువాయి

అణచివేత, పెత్తందారీతనం, నియంతృత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ పాలనకు ప్రాతిపదిక అని సీఎం పేర్కొన్నారు. అభివృద్ధి కేవలం గణాంకాల్లో కనిపించడం కాకుండా ప్రజల జీవితాల్లో మార్పుగా ప్రతిబింబించాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 25.35 లక్షల రైతు కుటుంబాలకు రూ.20,616 కోట్ల రుణమాఫీ చేసినట్లు పేర్కొన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, కొత్త రేషన్ కార్డులు వంటి పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. రైతు భరోసా, ఉచిత విద్యుత్, పంటల కొనుగోళ్లు వంటి చర్యలను కూడా ప్రభుత్వం కొనసాగిస్తోందని సీఎం రేవంత్ వెల్లడించారు.

సామాజిక న్యాయం దిశగా సమగ్ర కుల సర్వే చేపట్టామని, బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుతోపాటు కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం వంటి ప్రాజెక్టులను ప్రభుత్వం చేపడుతోందని వివరించారు. ఉద్యోగాల భర్తీలోనూ ప్రభుత్వం ముందడుగు వేసిందని సీఎం రేవంత్ తెలిపారు. యువతకు ప్రభుత్వ ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టామని, ఖాళీ పోస్టులను దశలవారీగా భర్తీ చేస్తామని ప్రకటించారు.

భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రైజింగ్ విజన్ 2047తో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను విస్తరించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. 30 వేల ఎకరాల్లో దేశంలోనే తొలి నెట్-జీరో స్మార్ట్ సిటీగా భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని ప్రతిపాదించామన్నారు. సాంకేతికత, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు తెలంగాణను కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. చరిత్రను మరవకుండా ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ తెలంగాణను మరింత అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# విమోచన వీరులను మరువొద్దు!

మొదటి పేజీ తరువాయి

రాంజీ గోండ్, తుర్రేబాజ్ ఖాన్, కొమురం భీమ్ తదితర వీరుల త్యాగాలను జాతీయ స్మృతిలో గుర్తుంచుకోవాలని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు. చరిత్రను కేవలం ప్రభుత్వ కార్యాలయాలు లేదా ప్రముఖ నాయకులు మాత్రమే నిర్మించరని.. సామాన్య ప్రజల త్యాగాలు కూడా చరిత్రను నిర్మిస్తాయని అన్నారు.

స్వతంత్ర భారతదేశ ఏకీకరణలో భారతరత్న సర్దార్ వల్లభభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని రాధాకృష్ణన్ అన్నారు. బలమైన, ఏకీకృత భారతదేశానికి పటేల్ దృఢమైన పునాది వేశారని పేర్కొన్నారు. అసాధ్యంగా కనిపించిన హైదరాబాద్ ఏకీకరణను ఆయన సుసాధ్యం చేశారని కొనియాడారు. హైదరాబాద్ ప్రజలు రజాకార్లకు వ్యతిరేకంగా చూపిన ధైర్యం, పోరాట స్ఫూర్తి అపారమని అన్నారు. హైదరాబాద్ విమోచన పోరాటంలో పాల్గొన్న యోధులకు, సర్దార్ పటేల్‌కు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని చెప్పారు.

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ తదితర ప్రాంతాల్లో నక్సలిజాన్ని ఎదుర్కొనడంలో కేంద్ర బలగాలు కీలకంగా పనిచేశాయని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. రాష్ట్ర పోలీసులతో సమన్వయంతో కేంద్ర సాయుధ బలగాలు వామపక్ష తీవ్రవాదాన్ని అణచివేశాయని తెలిపారు. నక్సల్ రహిత, సురక్షిత, అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యంతో కేంద్ర బలగాలు పనిచేస్తున్నాయని అన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, భద్రతకు కేంద్ర బలగాలు నిరంతరం కాపలాదారులుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజం తగ్గిన తర్వాత ఆరోగ్యం, విద్య రంగాల్లో మార్పులు కనిపిస్తున్నాయని.. ముప్పు తగ్గడంతో గతంలో అస్థిరతకు గురైన ప్రాంతాల్లో శాంతి, అభివృద్ధి, అవకాశాలు పెరుగుతున్నాయని వివరించారు.

రాజకీయ విలీనం భూభాగాలను ఏకం చేస్తే.. రాజ్యాంగ ప్రజాస్వామ్యం ప్రజలను ఏకం చేస్తుందని రాధాకృష్ణన్ అన్నారు. జాతీయ ఐక్యత కేవలం భౌగోళిక సరిహద్దులపై ఆధారపడి ఉండదని తెలిపారు. ప్రతి భారతీయుడికి సమాన హక్కులు, సమాన గౌరవం, సమాన అవకాశాలు కల్పించినప్పుడే జాతీయ ఐక్యత మరింత బలపడుతుందని పేర్కొన్నారు. భిన్న భాషలు మాట్లాడినా, భిన్న సంప్రదాయాలు పాటించినా, భిన్నంగా పూజలు చేసినా భారతీయులంతా రాజ్యాంగం, సార్వభౌమత్వ భావనతో ఒక్కటిగా ఉంటారని అన్నారు. మన సార్వభౌమత్వానికి అసలు అధికారం ప్రజలదేనని స్పష్టం చేశారు.

2022 నుంచి హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నామని రాధాకృష్ణన్ పేర్కొన్నారు. దేశ ఐక్యతను మరింత బలోపేతం చేయడానికి 'ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్' స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. "భారత్ ఒక్కటే.. భారత్ ఎప్పటికీ ఒక్కటిగానే ఉంటుంది. ఇదే సర్దార్ పటేల్‌కు మనం అందించే నిజమైన నివాళి" అని ఉపరాష్ట్రపతి అన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈసీ కసరత్తు!

**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (ఇది కద నిజం):** తెలంగాణలో త్వరలో ఖాళీ కాబోతున్న వరంగల్- ఖమ్మం-నల్గొండ, మహబూబ్ నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల భర్తీ కోసం ఈసీ కసరత్తు మొదలు పెట్టింది. ఈ రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు నూతన ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి గురువారం విడుదల చేశారు. ఈ నియోజకవర్గాల స్థానాల గడువు మార్చి 2027తో ముగియనుండటంతో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొత్తగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయనున్నారు. 1 నవంబర్ 2026ను అర్హత తేదీగా పరిగణనలోకి తీసుకుని ఈ ప్రక్రియను చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా హైదరాబాద్ - రంగారెడ్డి - మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ప్రాతినిథ్యం వహిస్తున్న సురభి వాణి దేవీ, వరంగల్- ఖమ్మం-నల్గొండ స్థానానికి ప్రాతినిథ్యం వహిస్తున్న తీన్మార్ మల్లన్న పదవీ కాలం వచ్చే మార్చితో ముగియనుంది.

పాత ఓటర్లు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందే:

గత ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నవారు కూడా ఈసారి కొత్తగా నమూనా ఫారమ్-18 ద్వారా తిరిగి దరఖాస్తు చేసుకోవడం తప్పనిసరి అని ఈసీ స్పష్టం చేసింది. పాత ఓటరు జాబితా ఆధారంగా నేరుగా పేరు నమోదు చేయబడదని స్పష్టం చేసింది. దరఖాస్తుతో పాటు అవసరమైన విద్యా అర్హత సర్టిఫికెట్ల ధ్రువీకరించిన కాపీలను జతచేయాల్సి ఉంటుంది. అర్హులైన పట్టభద్రులు సీఈఓ అధికారిక వెబ్‌సైట్ https://ceotelangana.nic.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా నిర్ణీత ఫారమ్‌ను పూర్తి చేసి అవసరమైన పత్రాలతో ఈఆర్ఓ/ ఏఈఆర్ఓ/ డెసిగ్నేటెడ్ అధికారులకు నేరుగా కానీ, పోస్ట్ ద్వారా కానీ అందజేయవచ్చని సీఈఓ కార్యాలయం తెలిపింది.

**ఓటరు జాబితా షెడ్యూల్:**

పబ్లిక్ నోటీసు విడుదల: 28 సెప్టెంబర్2026

ఫారమ్-18 దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: 6 నవంబర్ 2026

డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రచురణ: 25 నవంబర్ 2026

అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ: 25 నవంబర్ 2026 నుండి 10 డిసెంబర్ 2026 వరకు

తుది ఓటర్ల జాబితా ప్రచురణ: 30 డిసెంబర్ 2026

# విలీన పోరాటంపై కవిత కీలక వ్యాఖ్యలు!



**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (ఇది కద నిజం):** తెలంగాణ విలీన పోరాట యోధుల స్ఫూర్తితో రాష్ట్రంలో రాజ్యమేలుతున్న అరాచక శక్తులను గద్దె దించుతామని తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 అనేది తెలంగాణ పౌరుషానికి, పోరాట పటిమకు మరియు త్యాగాల చరిత్రకు నిదర్శనం అన్నారు. అయితే ఈ చారిత్రక రోజుపై కాంగ్రెస్, బీజేపీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు.

కాంగ్రెస్, బీజేపీలపై ఘాటు విమర్శలు:

సెప్టెంబర్ 17 చరిత్రను కాంగ్రెస్, బీజేపీలు వక్రీకరిస్తున్నాయని కవిత విమర్శించారు. స్టేట్ కాంగ్రెస్ పోరాటం వల్లే తెలంగాణ విలీనమైందని సీఎం అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. నిజానికి సంస్థానాల్లో పోరాటం చేయడం తమ విధానం కాదని నాడు గాంధీజీ అన్నారని కవిత గుర్తుచేశారు. నిజాం సర్కార్ పేదలకు ఇచ్చిన 10 లక్షల ఎకరాల భూమిని, భారత యూనియన్‌లో కలిశాక తిరిగి జమీందార్లకు అప్పగించిందే కాంగ్రెస్ అని ఆరోపించారు. ఇక ముస్లిం రాజుపై హిందువులు చేసిన పోరాటమని బీజేపీ మత రంగు పులిమే ప్రయత్నం చేస్తోందని కవిత ధ్వజమెత్తారు. ఆనాటి పోరాటంలో అసలు బీజేపీ, ఆర్ఎస్ఎస్ లేనే లేవని స్పష్టం చేశారు.

ప్రజలే తుపాకీ పట్టి పోరాడారు:

ఆనాటి జాగీర్‌దార్లు, జమీందార్ల దాష్టీకాలకు వ్యతిరేకంగా మతాలకు అతీతంగా ప్రజలే స్వచ్ఛందంగా పోరాడారని కవిత తెలిపారు. వట్టికోట ఆళ్వార్ స్వామి, సురవరం ప్రతాపరెడ్డి, రావి నారాయణరెడ్డి లాంటి మహనీయులు సైకిళ్లపై తిరుగుతూ ప్రజల్లో చైతన్యం నింపారని గుర్తుచేశారు. కాళోజీ, దాశరథి, షోయాబుల్లాఖాన్, మగ్దూం మొయినోద్దీన్ వంటి కవులు, రచయితలు సమరశంఖం పూరించారని కొనియాడారు. వారి చైతన్యంతోనే దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగీ, మల్లు స్వరాజ్యం, అరుట్ల కమలాదేవి లాంటి వీరులు ఉద్భవించారని పేర్కొన్నారు. నాడు మహనీయులు చూపిన పోరాట స్ఫూర్తితోనే, ప్రస్తుతం కులమతాలకు అతీతంగా ప్రజల హక్కులను కాపాడేందుకు తెలంగాణ రక్షణ సేన ముందుకు వచ్చిందని, అరాచక పాలనకు అంతం పలికే వరకు పోరాటం కొనసాగుతుందని కవిత అన్నారు.

# ఎస్‌బీఎన్‌పై కేంద్రం కఠిన చర్య!

మొదటి పేజీ తరువాయి

ఉపాలోని సెక్షన్ 35(1)(ఏ) ప్రకారం మొదటి షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా, దేశంలో నిషేధించిన 46వ ఉగ్రవాద సంస్థగా ఎస్‌బీఎన్ నమోదైంది. ఈ సిండికేట్ సరిహద్దుల గుండా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాలను అక్రమంగా రవాణా చేయడమే కాకుండా, అమాయకులైన యువతను, స్థానిక నేరస్థులను ప్రలోభపెట్టి ఉగ్రవాదం వైపు మళ్లిస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని 'ఉగ్రవాదంపై జీరో టోలరెన్స్ ' విధానంలో భాగంగానే ఈ కఠిన చర్య తీసుకున్నట్లు హోంశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెట్‌వర్క్ దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను, మత సామరస్యాన్ని దెబ్బతీసేందుకు సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా విద్వేషపూరిత, రెచ్చగొట్టే కంటెంట్‌ను ప్రచారం చేస్తోందని ప్రభుత్వం ఆరోపించింది. ఇతర నిషేధిత ఉగ్ర సంస్థలతో కుమ్మక్కై దేశ వ్యతిరేక కార్యకలాపాలకు నిధులు సమీకరించడం, ప్రజా శాంతికి భంగం కలిగించడంలో ఎస్‌బీఎన్ భాగస్వామ్యం కలిగి ఉందని తెలిపింది. ఈ నెట్‌వర్క్ సభ్యులపై ఉపా, భారతీయ న్యాయ సంహిత, ఆయుధాల చట్టం, ఐటీ చట్టం, పేలుడు పదార్థాల చట్టాల కింద ఇప్పటికే పలు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి.

# బ్రిక్స్ వేళ పాక్, ఐఎస్ఐ.. ఉగ్ర కుట్ర బట్టబయలు

**న్యూస్ డెస్క్, 17 సెప్టెంబరు (ఇది కద నిజం):** ఇండియా ఇటీవల ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన బ్రిక్స్ సదస్సును పాకిస్తాన్, ఆ దేశ ఇంటెలిజెన్స్ సర్వీస్ ఐఎస్ఐ భగ్నం చేయాలని ప్రయత్నించాయి. ఈ విషయం తాజాగా బయటపడింది. ఈ అంశంపై ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. న్యూఢిల్లీలో అంతర్జాతీయ బ్రిక్స్ సదస్సు సెప్టెంబర్ 11-13 వరకు ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వంటి అగ్రనేతలు హాజరయ్యారు. ఈ సదస్సు ఇండియా నిర్వహించిన తీరు ప్రత్యేకంగా నిలిచింది.

అయితే, ఇలాంటి సదస్సుకు ఆటంకం కలిగించాలని పాక్, ఐఎస్ఐ ప్రయత్నించాయి. జమ్మూ కాశ్మీర్ కథ్వా జిల్లాలోని హీరానగర్ సెక్టార్ నుంచి ఉగ్రవాదులను సరిహద్దుగుండా ఇండియా పంపించాలని ప్రయత్నించింది. సదస్సు సందర్భంగా దేశంలో పెద్ద ఉగ్రదాడి జరపాలని ప్రయత్నించింది. ఇందుకోసం హీరానగర్‌లోని బోబియా ప్రాంతంలో సరిహద్దు నుంచి ఇండియాలోకి చొరబడేందుకు కొన్ని స్థావరాల్ని కూడా పాక్ ఉగ్రవాదులు ఎంపిక చేసుకున్నారు. కానీ, ఈ విషయాన్ని ప్రభుత్వ భద్రతా దళాలు ముందుగానే పసిగట్టాయి. ఆయా ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశాయి. పాకిస్తాన్‌లోని అమ్రు చాక్, సుక్మాల్ ప్రాంతాలు.. ఇండియాలోని హీరానగర్ ప్రాంతాన్ని సరిహద్దుగా పంచుకుంటాయి.

ఇది మన సరిహద్దుకు అతి దగ్గరగా ఉన్న ప్రాంతం కావడంతో ఇక్కడినుంచి ఇండియాలోకి సులభంగా చొరబడవచ్చని పాక్, ఐఎస్ఐ భావించాయి. ఈ ప్రాంతంలో చొరబాటుదారులకు రక్షణ కల్పించే అవకాశాలున్నాయి. ఈ ప్రాంతంలోనే జమ్మూ-పఠాన్‌కోట్ హైవే ఉంది. ఇక్కడినుంచి ఇండియాలోని ప్రభుత్వ భవనాలు, మిలిటరీ క్యాంపులు, సాధారణ ప్రజల్ని లక్ష్యంగా చేసుకోవాలని భావించారు. అయితే, భద్రతా బలగాల అప్రమత్తతతో పెను ఉగ్రదాడి తప్పింది.

# కేసీఆర్ భూములపై రగడ!

మొదటి పేజీ తరువాయి

ఆ ట్వీట్‌లో కేసీఆర్ గతంలో ఎన్నికల అఫిడవిట్‌లో ప్రస్తావించిన భూములు, ఆస్తుల వివరాలను బయటపెట్టారు.

కేసీఆర్ ఎన్నికల అఫిడవిట్‌లలో పేర్కొన్న ఆస్తుల వివరాలను ప్రస్తావిస్తూ.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పలు ప్రశ్నలు సంధించారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన కేసీఆర్.. తనకు భూమి లేదని ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారని చెప్పారు. ఆ తర్వాతి కాలంలో ఆయన కుటుంబానికి భారీగా భూములు, ఆస్తులు ఎలా సమకూరాయని ప్రశ్నించారు. కేసీఆర్ ఆస్తుల విషయంలో ఎన్నికల అఫిడవిట్‌లే కీలక ఆధారాలని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

తెలంగాణ ఉద్యమ కాలం నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న సమయంలో కేసీఆర్ కుటుంబ ఆస్తులు భారీగా పెరిగాయని మంత్రి పొంగులేటి తీవ్ర ఆరోపణలు గుప్పించారు. 2004 కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కేసీఆర్ సమర్పించిన అఫిడవిట్‌లో తన పేరుపై వ్యవసాయ భూమి, ఇతర భూములు లేవని పేర్కొన్నట్లు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అనంతరం ఎన్నికల అఫిడవిట్‌లలో కనిపించే ఆస్తుల వివరాలను ప్రస్తావిస్తూ.. ఈ మార్పులకు కారణం ఏంటని నిలదీశారు.

ఎన్నికల అఫిడవిట్‌లలో అభ్యర్థులు స్వయంగా ప్రకటించే ఆస్తుల వివరాలు నమోదవుతాయి. వాటిలో భూములు, ఇళ్లు, వాణిజ్య ఆస్తులు, ఇతర స్థిరాస్తులు, అప్పులు వంటి అంశాలను తప్పకుండా పేర్కొనాల్సి ఉంటుంది. కేసీఆర్ కుటుంబ ఆస్తుల పెరుగుదలపై తీవ్ర ఆరోపణలు చేసిన మంత్రి పొంగులేటి.. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ భూములు, పేదలు, దళితులకు చెందిన అసైన్డ్ భూముల విషయంలో భారీ ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. ఆ భూముల కారణంగానే కేసీఆర్ కుటుంబానికి భారీ స్థాయిలో ఆస్తులు సమకూరాయని విమర్శలు గుప్పించారు.

మా తాతకు వందల ఎకరాలుండేవి.. రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఛాలెంజ్

మరోవైపు.. కేసీఆర్ భూముల విషయంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపైనా మంత్రి పొంగులేటి మండిపడ్డారు. పుట్టుకతోనే కేసీఆర్‌కు వందల ఎకరాల భూములు ఉన్నాయని చెబుతున్న కేటీఆర్‌పైనా పొంగులేటి విమర్శలు చేశారు. అలాంటి వాదనలకు, ఎన్నికల అఫిడవిట్‌లలో నమోదైన వివరాలకు మధ్య వ్యత్యాసం ఉంటే దానిపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఆస్తుల విషయంలో అఫిడవిట్‌లో తప్పులు నమోదయ్యాయా.. లేక ప్రజలకు వేరే వివరాలు చెబుతున్నారా.. అని కేటీఆర్‌ను ఉద్దేశించి పొంగులేటి ప్రశ్నించారు.

తెలంగాణలో గత కొంతకాలంగా భూములు, 22ఏ నిషేధిత జాబితా, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూముల అంశాలు అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ వివాదానికి కేంద్రంగా మారుతున్నాయి. ఇటీవల రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 22ఏ జాబితాలో భూముల సమస్య పెరిగిందని ఆరోపించారు. దీనిపై బీఆర్ఎస్ నేతలు కూడా స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే తాజాగా కేసీఆర్ ఎన్నికల అఫిడవిట్‌లలోని ఆస్తుల వివరాలను ప్రస్తావిస్తూ పొంగులేటి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

# నిజాం--రజాకార్లకు ఎదురొడ్డి నిలిచిన
# తెలంగాణ యోధుడు సిల్వేరి పోల్కయ్య



ఇది కద నిజం,హైదరాబాద్: నిజాం నిరంకుశ పాలనకు, రజాకార్ల దౌర్జన్యాలకు ఎదురు నిలిచిన తెలంగాణ ప్రజా పోరాట చరిత్రలో ఎందరో తమ ప్రాణాలను, జీవితాలను పణంగా పెట్టిండ్రు. అలాంటి పోరాట యోధుల్లో సిల్వేరి పోల్కయ్య ఒకరు. 1930లో హైదరాబాద్ పాతనగరంలోని బార్కాస్ సమీపంలోని కొత్తపేటలో జన్మించిన పోల్కయ్య 2007లో కన్నుమూశారు. చిన్ననాటి నుంచే సమాజంలో ఉన్న అసమానతలు, పేద ప్రజలపై జరుగుతున్న అణచివేత ఆయనను బాగా ప్రభావితం చేసాయే. ఆ తర్వాత కమ్యూనిస్టు ఉద్యమంతో అనుబంధం పెంచుకున్న పోల్కయ్య ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటూ ముందుకు సాగిండ్రు.

## నిజాం పాలనకు వ్యతిరేకంగా

1940ల కాలంలో హైదరాబాద్ సంస్థానంలో నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు ఊపందుకున్నయి. ముఖ్యంగా తెలంగాణ పల్లెల్లో రైతులు ఎదుర్కొన్న వెట్టి చాకిరీ, భూస్వాముల దోపిడీ, పన్నుల భారం, సామాజిక అణచివేత వంటి సమస్యలు ప్రజలను పోరాట బాట పట్టించాయే. ఇదే సమయంలో నిజాం పాలనకు అండగా నిలిచిన రజాకార్ల అరాచకాలు కూడా ముదిరిపోయినయి. ఈ పరిస్థితుల్లో సిల్వేరి పోల్కయ్య ప్రజలను సమీకరించడంలో తనదైన పాత్ర పోషించిండ్రు. వక్తగా, పాటల ద్వారా ప్రజల్లో పోరాట స్ఫూర్తిని రగిలించే కార్యకర్తగా ఆయన గుర్తింపు తెచ్చుకున్నరు. రజాకార్లకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో పాల్గొన్నందుకు పలుమార్లు నిర్బంధాన్ని కూడా ఎదుర్కొన్నరు.

## గుండ్రాంపల్లి పోరాటంలో కీలక పాత్ర

సిల్వేరి పోల్కయ్య పోరాట జీవితంలో నల్గొండ జిల్లాలోని గుండ్రాంపల్లి ఘటనకు ప్రత్యేక స్థానం ఉన్నది. రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన ప్రతిఘటనలో ఆయన చురుగ్గా పాల్గొన్నారని జీవితచరిత్ర ఆధారాలు పేర్కొంటున్నయి. అంతేకాదు, మంగళపల్లి, ఆరుట్ల ప్రాంతాల్లో రజాకార్లకు వ్యతిరేకంగా సాగిన తిరుగుబాట్లలోనూ పోల్కయ్య కీలకంగా పనిచేసినట్లు కుటుంబ వర్గాల సమాచారం. ఆయా ప్రాంతాల్లో ప్రజలను సమీకరించడం, ఉద్యమానికి అండగా నిలపడం, రజాకార్ల దౌర్జన్యాలకు ఎదురొడ్డి నిలవడంలో ఆయన పాత్ర ఉన్నదని పేర్కొంటారు.

## ధర్మభిక్షంతో సన్నిహిత అనుబంధం

తెలంగాణ కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రముఖ నాయకుడిగా పేరొందిన బొమ్మగాని ధర్మభిక్షంతో సిల్వేరి పోల్కయ్యకు సన్నిహిత అనుబంధం ఉండేది. ఇద్దరూ కలిసి ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నరు. ప్రజల సమస్యలపై పోరాడుతూ, సామాజిక మార్పు కోసం పనిచేయాలనే లక్ష్యంతో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లిండ్రు. ధర్మభిక్షం వంటి ఉద్యమ నాయకులతో ఏర్పడిన అనుబంధం పోల్కయ్య రాజకీయ, ప్రజా జీవితంపై మరింత ప్రభావం చూపిందని కుటుంబ సభ్యులు గుర్తుచేసుకుంటారు.

## పోరాటం తర్వాత కూడా ప్రజలతోనే

1948లో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన తర్వాత కూడా తెలంగాణలో రాజకీయ, సామాజిక ఉద్యమాలు కొనసాగినయి. ఈ పరిణామాల మధ్య కూడా పోల్కయ్య ప్రజా సమస్యలపై తన కార్యకలాపాలను కొనసాగించిండ్రు. ఉద్యమ కాలంలో ఎదురైన నిర్బంధాలు, ఒత్తిళ్లు, ప్రతికూల పరిస్థితులు ఆయన జీవితంలో భాగమయ్యాయి. అయినా ప్రజలతో మమేకమై, తనకు నమ్మిన సిద్ధాంతాల కోసం పనిచేసిన వ్యక్తిగా ఆయనను కుటుంబ సభ్యులు, ఆయనతో కలిసి పనిచేసిన వారు గుర్తుచేసుకుంటారు.


## తరాలకు గుర్తుండే పోరాట వారసత్వం

సిల్వేరి పోల్కయ్య 2007లో కన్నుమూసినా నిజాం--రజాకార్లకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ ప్రజా పోరాటంతో ఆయనకు ఉన్న అనుబంధం చరిత్రలో నిలిచిపోయింది. పల్లె ప్రజల బాధలు, అణచివేతకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమం, ప్రజల్లో చైతన్యం నింపిన పాటలు, పోరాట స్ఫూర్తి---ఇవన్నీ ఆయన జీవిత ప్రయాణంలో ముఖ్యమైన అంశాలుగా నిలిచాయి. పోల్కయ్య వారసత్వం కుటుంబంలోనూ కొనసాగింది. ఆయన కుమారుడు సిల్వేరి శ్రీశైలం జర్నలిజం రంగంలో కొనసాగుతూ ప్రజా సమస్యలను తన వృత్తిలో భాగంగా ముందుకు తీసుకెళ్లారు. "పోరాటం అంటే మాటలు కాదు.. ప్రజల కోసం నిలబడటం" అనే భావనకు పోల్కయ్య జీవితం ఒక నిదర్శనంగా నిలిచిందని ఆయనను గుర్తుచేసుకునే కుటుంబ సభ్యులు, సహచరులు చెబుతున్నారు.

# హైదర్గూడాలో ఘనంగా 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'

ఇది కద నిజం, అత్తాపూర్: హైదర్గూడాలోని హైందవ నగర్, పి.వి.ఎన్.ఆర్ పిల్లర్ నంబర్ 143 సమీపంలో సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థాన విమోచన దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు పంతంగి రాజగోపాల్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నిజాం నిరంకుశ పాలనను అంతమొందించి, హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడంలో కీలక పాత్ర పోషించిన భారత తొలి స్వదేశీ వ్యవహారాల మంత్రి, 'ఉక్కు మనిషి' సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా పంతంగి రాజగోపాల్ గౌడ్ మాట్లాడుతూ సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. నిజాం రాజుల క్రూర పాలన మరియు రజాకార్ల దౌర్జన్యాల నుండి తెలంగాణ, మరాఠ్వాడ, కల్యాణ కర్ణాటక ప్రాంతాలకు విముక్తి కలిగించిన చారిత్రాత్మక రోజని గుర్తుచేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చేపట్టిన సాహసోపేతమైన 'ఆపరేషన్ పోలో' వల్లే హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమై ప్రజలకు స్వేచ్ఛ లభించిందని కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా బీజేపీ శ్రేణులు విమోచన ఉత్సవాల్లో ఉత్సాహంగా పాలుపంచుకున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కొమురయ్య, జిల్లా కార్యదర్శి మల్లేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు సులిగే వెంకటేష్, జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్, అందె బాబయ్య, డి. సత్యనారాయణ, ఏ. స్వర్ణలత రెడ్డి, పి. మమత రెడ్డి, డి. సరిత రెడ్డి, ఏ. నర్సింహా, సి. హెచ్. వెంకటరమణ గుప్త, సర్దార్ జితేందర్ సింగ్, బాత్కు శ్రీనివాస్, అనురాధ, కాకులారం కృష్ణ, కే. కిరణ్ చారి,



వీరేందర్, కైల రవీందర్ రెడ్డి, మహేందర్, గౌరిగే రాజు, బీ. సతీష్, గురు ప్రీత్ సింగ్, విజయ్ రావుత్, అశోక్, ఈశ్వర్, వంశీరాజ్లతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అత్తాపూర్ ఇస్కాన్ ఆలయంలో
# సెప్టెంబర్ 19న శ్రీ రాధాష్టమి వేడుకలు

ఇది కద నిజం, అత్తాపూర్ : అత్తాపూర్ ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ ఏడాది అత్యంత వేడుకగా నిర్వహించే శ్రీ రాధాష్టమి మహోత్సవాలకు ఆలయం సిద్ధమైంది. రాబోయే సెప్టెంబర్ 19, 2026న శ్రీమతి రాధారాణి దివ్య ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. భక్తులందరూ ఈ పవిత్ర వేడుకలో పాల్గొని శ్రీమతి రాధారాణి కృపాకటాక్షాలు పొందాలని ఆధ్యాత్మిక నిర్వాహకులు కోరుతున్నారు. ఈ దివ్య వేడుకలు ఉదయం 4:30 గంటలకు మంగళ హారతితో ప్రారంభమవుతాయి. అనంతరం ఉదయం 7:30 గంటలకు గురు పూజ, 8:00 గంటలకు శృంగార దర్శన హారతి నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రీమతి రాధారాణి దివ్య లీలలపై విశేష ఆధ్యాత్మిక ప్రవచనం జరగనుంది. ఉదయం 11:00 గంటలకు అత్యంత వైభవంగా జరిగే 'మహా అభిషేకం' కార్యక్రమంలో స్వామి, అమ్మవార్లు భక్తులకు దివ్య దర్శనమివ్వనున్నారు. మధ్యాహ్నం 12:30 గంటలకు రాజభోగ్ హారతి నివేదన అనంతరం, 1:00 గంటల నుండి విచ్చేసిన భక్తులందరికీ 'మహా ప్రసాదం' వితరణ చేయనున్నారు. ఈ మహోత్సవ ఆధ్యాత్మిక సేవల్లో భాగస్వాములై తమ వంతు విరాళాలు, సహాయ సహకారాలు అందించాలనుకునే భక్తులు అధికారిక వెబ్‌సైట్ https://www.iskconattapur.com/radhashtami ను సందర్శించవచ్చని ఆలయ వర్గాలు తెలిపాయి. భక్తులంతా విశేష సంఖ్యలో పాల్గొని ఈ ఉత్సవాన్ని జయప్రదం చేయాలని ఆహ్వానిస్తున్నారు.




# నవాబుపేటలో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం, మోదీ జన్మదిన వేడుకలు

## ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా 'సేవా సంకల్ప' రక్తదాన శిబిరం





ఇది కద నిజం, నవాబుపేట్: నవాబుపేట్ మండల బీజేపీ కార్యాలయం వద్ద తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షులు చంద్రకాంత్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాటి సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవ, 'ఆపరేషన్ పోలో' చర్యల వల్లే హైదరాబాద్ నిజాం సంస్థానం భారతదేశంలో విలీనమైందని, ప్రజలకు స్వేచ్ఛ లభించిందని కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన 'సేవా సంకల్ప' కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలకు సేవ చేయడమే ధ్యేయంగా, రక్తదానంతో మరొకరి ప్రాణాన్ని కాపాడవచ్చనే ఆశయంతో చేపట్టిన ఈ శిబిరంలో పార్టీ నాయకులు, యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఐటీ సెల్ కో-కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, దళిత మోర్చా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు గాలయ్య, మండల ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, చిట్టిగిద్ద సర్పంచ్ శ్రీధర్ రావు, సీనియర్ నాయకులు శేఖర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, ఉప సర్పంచులు ధీరత్ రెడ్డి, మహేందర్, మండల ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, భీమ్ రెడ్డి, మండల కార్యదర్శులు రవి, విజయ్, నాయకులు మల్లేశం, రామ్ రెడ్డి, నర్సింలు, కృష్ణారెడ్డి, లక్ష్మణ్, రవీందర్, శ్రీనివాస్, శ్రీకాంత్, రవి, మధుసూదన్ రెడ్డి, మానేయ్య, రమేష్, మహేందర్, గౌస్, ఆంజనేయులతో పాటు వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# గౌరారం గ్రామపంచాయతీ లో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం గౌరారం గ్రామపంచాయతీ ఆవరణలో ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లోకనేని హనుమంతరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేశారు. అనంతరం గ్రామ ప్రజలకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి. లక్ష్మణ్, వార్డు సభ్యులు కుమ్మరి రాజు, లక్ష్మి, మల్లేష్, గంగాధర్, పంచాయతీ సిబ్బంది, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# శాంతియుతంగా వినాయక ఉత్సవాలు నిర్వహించాలి: సీఐ తిరుపయ్య



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పిట్లం మండల కేంద్రంలోని గణేష్ మండపాలను గురువారం బాన్సువాడ గ్రామీణ సీఐ తిరుపయ్య, పిట్లం ఎస్సై బి. ఆంజనేయులు పరిశీలించారు. మండపాల వద్ద భద్రతా ఏర్పాట్లు, విద్యుత్ సౌకర్యాలు, రాకపోకలకు సంబంధించిన పరిస్థితులను పరిశీలించారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండపాల వద్ద నిబంధనలు పాటిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు పోలీసులకు సహకరించాలని నిర్వాహకులను కోరారు.

# బోయవాడ ఎంపీపీఎస్‌లో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాదరక్షలు పంపిణీ



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: పిట్లం మండలంలోని బోయవాడ ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాదరక్షలను పిట్లం సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్, వార్డు సభ్యులు బాలకృష్ణ తదితరులు కలిసి పంపిణీ చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని వారు సూచించారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు సహకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మిల్లర్ల ఆవేదన..
# సమస్యల పరిష్కారానికి విన్నపం



ఇది కద నిజం న్యూస్ ప్రతినిధి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం : రైస్ మిల్లర్ల క్షేత్రస్థాయి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు పిట్లం మండలాల మిల్లర్లు నిరవధిక సమ్మె చేపట్టారు. గురువారం తహసీల్దార్ మహేందరు వినతిపత్రం సమర్పించారు. పంట ధాన్యం సేకరణలో జాప్యం వల్ల జరిగిన తరుగుదల, గోదాముల కొరత, Non-FAQ ధాన్యంతో తీవ్ర ఆర్థిక నష్టాలు వస్తున్నాయని వాపోయారు. CMR గడువు పొడిగించాలని చర్యలు తీసుకోవాలని మిల్లర్లు కోరారు.

# గౌరారంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా : గౌరారం గ్రామంలో దోమల నివారణకు సర్పంచ్ లోకినేని హనుమంతరావు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామంలో దోమల బెడదను తగ్గించేందుకు ఫాక్నాక్ పవర్ స్ప్రేయర్ ఏర్పాటు చేసి, గ్రామంలోని అన్ని వీధుల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. గ్రామంలోని గల్లీగల్లీ తిరుగుతూ పిచికారీ కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య చర్యలను చేపట్టారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు నిరంతరం చర్యలు కొనసాగిస్తామని సర్పంచ్ తెలిపారు.

# సినిమా న్యూస్

## రూమర్స్‌కు చెక్



మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. చిరంజీవి, దర్శకుడు బాబీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కాక' విడుదల తేదీపై నెలకొన్న ఊహాగానాలకు చిత్రబృందం ఫుల్‌స్టాప్ పెట్టింది. ఈ సినిమాను 2027 సంక్రాంతి కానుకగా జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది.

'కాక' రిలీజ్ డేట్‌పై కొంతకాలంగా రకరకాల వార్తలు ప్రచారంలో ఉన్న నేపథ్యంలో మేకర్స్ ఈ అధికారిక ప్రకటన చేశారు. 'కాక' మూవీ జనవరి 13, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది అని వెల్లడించారు. దీంతో మెగాస్టార్ సినిమా సంక్రాంతి రేసులో ఉండబోతున్నట్లు మరోసారి స్పష్టమైంది.

ఇదివరకు చిరంజీవి, బాబీ కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఇదే కాంబో మరోసారి జతకట్టడంతో 'కాక'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. చిరంజీవి మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా యాక్షన్, కమర్షియల్ అంశాలతో దర్శకుడు బాబీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ నారాయణ ఈ సినిమాను భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. పాన్-ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతో సినిమాను గ్రాండ్‌గా రూపొందిస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది.

ఇప్పటికే రిలీజ్ డేట్‌ను ప్రకటించిన మేకర్స్.. అభిమానులకు మరో ట్రీట్ కూడా ఇచ్చారు. సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ను త్వరలో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. దీంతో మెగాస్టార్ అభిమానుల్లో సినిమాపై మరింత ఆసక్తి నెలకొంది. ఇప్పుడు సంక్రాంతి 2027 రేసులో 'కాక' అధికారికంగా తన స్థానాన్ని ఖరారు చేసుకోవడంతో.. వచ్చే ఏడాది సంక్రాంతి బాక్సాఫీస్ పోరు మరింత ఆసక్తికరంగా మారనుంది.

## 'తార' రిలీజ్‌పై క్లారిటీ




మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఆకాశంలో ఒక తార'. ఈ సినిమా విడుదల తేదీని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ ఫీల్ గుడ్ మూవీని నవంబర్ 20వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ అప్‌డేట్‌ను సోషల్ మీడియా వేదికగా పంచుకున్న దుల్కర్ సల్మాన్.. "ఇప్పటివరకు ఈ ప్రయాణం చాలా అందంగా సాగింది. నవంబర్ 20న ఈ సరికొత్త ప్రపంచాన్ని మీ అందరికీ పరిచయం చేయడానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను.. ఇట్లు మీ కృష్ణ" అంటూ తన పాత్ర పేరుతో ఒక ఆసక్తికరమైన పోస్ట్ చేశారు.

పవన్ సాధినేని దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో గ్లామరస్ బ్యూటీ శృతి హాసన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలు గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా మరియు లైట్‌బాక్స్ బ్యానర్‌లు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాష్ కుమార్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండగా, సుజిత్ సారంగ్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. విభిన్నమైన కథాంశంతో, భారీ తారాగణంతో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం అభిమానులు, ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## ట్రెండింగ్‌లో 'రాకా 37'!





టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'రాకా' సినిమాకు సంబంధించి సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఈ చిత్రానికి సంబంధించి తాజాగా చిత్ర నిర్మాణ సంస్థ ఎక్స్ వేదికగా 37 అనే నెంబర్‌ని పోస్ట్ చేసింది. అయితే ఈ సంఖ్య వెనుక ఓ కొత్త అప్‌డేట్ రాబోతుందని తెలుస్తుంది. దీంతో

నెట్టింట #WhatisRaaka37 అనే హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్‌లోకి వచ్చింది. అసలు ఈ ట్రెండింగ్‌లో కనిపిస్తున్న '37' అనే సంఖ్య దేనికి సంబంధించినది? చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఎలాంటి సరికొత్త ప్రకటన రాబోతుంది? అంటూ అల్లు అభిమానులు తీవ్ర ఉత్కంఠతో చర్చించుకుంటున్నారు.

స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో, సన్ పిక్చర్స్ వంటి ప్రముఖ నిర్మాణ సంస్థ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ ప్రతిష్టాత్మక సినిమాను తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. అల్లు అర్జున్ కెరీర్‌లో అత్యంత భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ తరుణంలో మేకర్స్ ప్లాన్ చేసిన ఈ సరికొత్త సర్ప్రైజ్ అప్‌డేట్ ఏమై ఉంటుందోనని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక క్లారిటీ రానుంది.


## దసరా బరిలో రౌడీ హీరో!



రౌడీ హీరో విజయ్ దేవరకొండ, డైరెక్టర్ రాహుల్ సాంకృత్యాన్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పిరియాడిక్ యాక్షన్ మూవీ 'రణబాలి'. ఈ చిత్రంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో విపరీతమైన ప్రచారం జరిగింది. దసరా బరి నుంచి రణబాలి తప్పుకుందని, సినిమా డిసెంబర్‌కు వాయిదా పడిందంటూ వచ్చిన వార్తలు రౌడీ ఫ్యాన్స్‌ను తీవ్ర గందరగోళానికి గురిచేశాయి. అయితే వాటన్నింటికీ చెక్ పెడుతూ తాజాగా చిత్ర యూనిట్ అదిరిపోయే అప్‌డేట్‌తో ముందుకొచ్చింది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను రౌడీ హీరో విజయ్ దేవరకొండ ఈ రోజుతో అధికారికంగా పూర్తి చేశారు. నేటితో గుమ్మడికాయ కొట్టేసి, అనుకున్న డేట్‌కే థియేటర్లలో దిగుతున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు.

'టాక్సీవాలా' వంటి సూపర్ హిట్ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న చిత్రం కావడంతో పాటు, ఇటీవల విడుదలైన గ్లింప్స్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. దసరా కానుకగా అక్టోబర్ 16న ఈ చిత్రాన్ని విడుదల చేస్తామని మేకర్స్ ఎప్పుడో ప్రకటించారు. కానీ నెట్టింట మాత్రం రకరకాల ఊహాగానాలు చక్కర్లు కొట్టాయి. ఈ సినిమా షూటింగ్ ఇంకా బ్యాలెన్స్ ఉండటం, భారీగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు పెండింగ్‌లో ఉన్నాయంటూ రూమర్స్ మొదలయ్యాయి. అలాగే దసరా రేసులో సూపర్ స్టార్ రజనీకాంత్ చిత్రం 'జైలర్ 2' ఉండటంతో పోటీని తప్పించుకోవడానికే డిసెంబర్ 3కు రణబాలిని షిఫ్ట్ చేస్తున్నారంటూ వరుస పోస్ట్‌లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే ఈ పుకార్లకు ఫుల్‌స్టాప్ పెడుతూ మేకర్స్ తాజాగా క్లారిటీ ఇచ్చారు. విజయ్ దేవరకొండ ఈరోజుతో తన పూర్తి భాగానికి సంబంధించిన షూటింగ్‌ను కంప్లీట్ చేయడంతో చిత్రబృందం గుమ్మడికాయ కొట్టేందుకు రంగం సిద్ధం చేసింది. ఇక మిగిలిన సమయాన్ని పూర్తిగా పోస్ట్ ప్రొడక్షన్, విజువల్ ఎఫెక్ట్స్ మెరుగుపరచడానికే కేటాయించనున్నారు. డిసెంబర్‌కు వాయిదా పడిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని నిర్మాతలు తేల్చిచెప్పారు. మాట ఇచ్చినట్టుగానే దసరా పండుగ సందర్భంగా అక్టోబర్ 16నే ప్రపంచవ్యాప్తంగా రణబాలి థియేటర్లలోకి గ్రాండ్‌గా రాబోతుందని స్పష్టం చేయడంతో రౌడీ ఫ్యాన్స్‌లో ఉత్సాహం ఉరకలేస్తోంది. బాక్సాఫీస్ వద్ద ఎంతటి పోటీ ఉన్నా.. తమ కంటెంట్‌పై నమ్మకంతో ముందే చెప్పిన తేదీకే రణరంగంలోకి దిగడానికి రణబాలి టీమ్ సిద్ధమైపోయింది.

## 'ప్యారడైజ్' ప్రీమియర్స్‌లో సెన్సేషన్!



టాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్' చిత్రంపై ట్రేడ్ వర్గాలతో పాటు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నేచురల్ స్టార్ నాని కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా, సినిమా విడుదలకు ముందే సరికొత్త ట్రెండ్‌కు తెరలేపారు. సెప్టెంబర్ 23న తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఏకంగా 800లకు పైగా భారీ ప్రీమియర్ షోలను ప్రదర్శించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

ఇప్పటివరకు విడుదలైన ఈ సినిమా ప్రచార చిత్రాలు, టీజర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఇందులో నాని ఇప్పటివరకు చూడని సరికొత్త రగ్గడ్ మరియు మాస్ లుక్‌లో కనిపించనున్నారు. సెప్టెంబర్ 24 నుంచి థియేటర్లలో 'జడల జమాన' అధికారికంగా ప్రారంభం కానుండటంతో నాని అభిమానులు, మాస్ ఆడియెన్స్ ఈ సినిమా కోసం అత్యుత్సాహంతో ఎదురుచూస్తున్నారు. ట్రెండింగ్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి అదిరిపోయే సంగీతం అందిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా అత్యంత గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు.